క్లుప్తంగా

ఘనంగా భీమారెడ్డి జయంతి


రక్తదానం చేస్తున్న విద్యార్థి

ఆదోని రూరల్: ఆదోని–ఆలూరు రహదారిలోని భీమా ఇంజినీరింగ్ కళాశాలలో భీమారెడ్డి జయంతిని కాశాల సెక్రటరీ విష్ణువర్దన్ రెడ్డి, ప్రిన్సిపాల్ సురేంద్రబాబు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అంతకముందు ధణాపురం నుంచి కళాశాల వరకు ద్విచక్ర వాహనంతో ర్యాలీ నిర్వహించారు. కళాశాలలో భీమారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. అనంతరం ఏడీపీ వలంటరీ బ్లడ్ డొనేషన్ వారి ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ సి.సురేష్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. విద్యార్థులు రక్తదానం చేశారు. సివిల్ హెచ్ఓ డి.నందినిరెడ్డి ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టగా పలువురిని అలరించాయి.

స్వచ్ఛ పట్టణానికి ప్రజలు సహకరించాలి

ఎమ్మిగనూరుటౌన్: స్వచ్ఛ పట్టణంగా మార్చేందుకు పట్టణ ప్రజలు పారిశుధ్య సిబ్బందికి సహకరించాలని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి సూచించారు. మంగళవారం పట్టణంలోని పార్క్‌రోడ్, ట్యాంక్‌బండ్ రోడ్, షరాఫ్ బజార్ ప్రాంతాల్లో పారిశుధ్య పనులను పరిశీలించారు. ప్రజలు తమ ఇళ్లలోని చెత్తను రోడ్లు, డ్రైనేజీల్లో పారవేయవద్దని కోరారు. చెత్తను పారిశుధ్య సిబ్బందికి ఇవ్వాలన్నారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో పన్ను చెల్లింపుల కేంద్రాన్ని పరిశీలించి సిబ్బందికి పలు సూచనలిచ్చారు.

పెండింగ్ వేతనాలు చెల్లించండి

గోనెగండ్ల : మేజర్ గ్రామ పంచాయతీలో పని చేస్తున్న పారిశుధ్య, స్వచ్ఛభారత్ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న మూడు నెలల వేతనాలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా నాయకుడు ఎండి ఆనంద్ బాబు, కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కరుణాకర్ డిమాండ్ చేశారు. మంగళవారం వారు కార్మికులతో కలిసి సర్పంచ్ హైమావతి, ఈఓ సతీష్‌కు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న కార్మికులకు మూడు నెలల వేతనాల్లో కోత విధించి ఇవ్వడం దారుణమన్నారు. కార్మికుల చేత వెట్టి చాకిరి చేయించుకుని వేతనాల్లో కోత విధించడం సరికాదన్నారు. అధికారులు స్పందించి పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల నాయకులు బతుకన్న, మునెప్ప, నబి రసూల్, కార్మికులు లింగన్న, వరలక్ష్మి, వెంకటేశ్వరమ్మ, మధుమతి, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతుల సమస్యలు పరిష్కరించాలి

కోసిగి: కౌలు రైతుల సమస్యలను పరిష్కరించాలని ఏపీ రైతు సంఘం తాలూకా అధ్యక్షుడు ఎం.గోపాల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం కోసిగిలోని సచివాలయం–2 ఎదుట ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో కౌలు రైతులతో కలిసి నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ కౌలు రైతులకు గుర్తింపు కార్డులు అందజేసి యజమానుల ప్రమేయం లేకుండా నేరుగా బ్యాంక్‌లో పంట రుణాలు అందించి ఆదుకోవాలన్నారు. అలాగే పంటలు నష్ట పోయిన కౌలు రైతులకే పరిహారం అందేలా చూడాలని కోరారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని సచివాలయం వెల్ఫేర్ అసిస్టెంట్ రజిత, ఇంజినీరింగ్ అసిస్టెంట్ చంద్రకళలకు అందజేశారు. ఆ సంఘం నాయకులు తాయన్న, ఓంకార్ స్వామి, పరుశురామ్, నరసింహులు, హుసేని తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు రూ.26 వేలు వేతనం ఇవ్వాలి

ఆదోని రూరల్:అంగన్‌వాడీలకు నెలకు రూ.26 వేలు వేతనం అందించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు పి.ఎస్.రాధాకృష్ణ, అంగన్‌వాడీ జిల్లా కార్యదర్శి కె.వెంకటమ్మ, ప్రాజెక్టు అధ్యక్షురాలు వరలక్ష్మి డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక కార్యాలయంలో మంగళవారం వారు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో 42 రోజులపాటు సమ్మె చేస్తే దీక్షాశిబిరాల వద్దకు అప్పటి ప్రతిపక్ష కూటమి నాయకులు వచ్చి హామీలను గుప్పించారన్నారు. అధికారంలోకి వచ్చిన త ర్వాత వాటిని అమలు చేయకుండా కాలయాప న చేస్తున్నారన్నారు.అనంతరం నూతన కమి టీని ఎన్నుకున్నారు. ఇందులో ప్రాజెక్టు రూరల్ కమిటీ అధ్యక్షురాలుగా గీత, కార్యదర్శిగా వరలక్ష్మి, ఉపాధ్యక్షులుగా కరుణ, శాంతి, ధనలక్ష్మి, సహాయ కార్యదర్శులుగా రిజ్వానా, కృష్ణవేణి, లక్ష్మి, కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

ఆదోని అర్బన్: ఆదోని నియోజకవర్గంలో అనారోగ్యానికి గురై ఆసుపత్రిల్లో చికిత్స పొంది బిల్లులు పెట్టుకున్న వారందరికీ సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంగళవారం ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి చెక్కులు పంపిణీ చేశారు. నియోజకవర్గంలోని ఆయా ప్రాంతాల్లోని 18 మందికి గానూ రూ.19,44,663 చెక్కులను పంపిణీ చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఐసీడీఎస్ భవనం.. ఐదేళ్లకే శిథిలం

- గత టీడీపీ ప్రభుత్వ హయాంలో రూ. 29 లక్షలతో నిర్మాణం
- ఐదేళ్లు పూర్తి కాకుండానే కుంగిపోయిన ఫ్లోరింగ్
- గోడలకు పగుళ్లు ఇచ్చిన వైనం
- మరమ్మతులు కూడా చేపట్టని అధికారులు
- విధిలేని పరిస్థితుల్లో అక్కడే విధులు నిర్వహిస్తున్న సిబ్బంది


ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం

ఆదోని సెంట్రల్: ఆదోని పట్టణం చైతన్యకాలనీలో నిర్మించిన ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలోని ఫ్లోరింగ్ (బండపరుపు) ఐదేళ్లకే కుంగిపోయింది. భవనం గోడలు కూడా నెర్రెలు ఇచ్చాయి. మరమ్మతులు చేపట్టాల్సిన అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. విధిలేని పరిస్థితిల్లో ఐసీడీఎస్ కార్యాలయ సిబ్బంది శిథిలమైన భవనంలోనే విధులను నిర్వహిస్తున్నారు.

టైల్స్ అస్తవ్యస్తం

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో శిశు అభివృద్ధి సేవా పథకం(ఐసీడీఎస్) ప్రాజెక్టు కార్యాలయ భవన నిర్మాణానికి రూ.29 లక్షల నిధులను మంజూరు చేసింది. గుత్తేదారుడు పనులను చేపట్టి 2020వ సంవత్సరంలో పూర్తి చేశాడు. 2020 డిసెంబర్ 28వ తేదీన భవనాన్ని ప్రారంభించారు. ప్రారంభించి నాలుగన్నర ఏళ్లకే బండపరుపు కుంగి పోయింది. టైల్స్ అస్తవ్యస్తంగా మారాయి. ఇక టాయిలెట్ రూమ్‌లో కూడా బేసిన్‌కూడా పాడై పోయింది. గదులలో అక్కడ అక్కడ టైల్స్ లేచి అస్తవ్యస్తంగా మారింది. గోడ లు కూడా అక్కడక్కడ క్రాక్స్ వచ్చాయి. బయట వరండాలో కూడా బండలు కుంగిపోయి అస్తవ్యస్తంగా మారాయి.


వరండాలో టైల్స్ ఇలా..


టాయిలెట్‌లో కుంగిపోయిన బెసిన్


కుంగిపోయిన ఫ్లోరింగ్ టైల్స్

భయాందోళన మధ్య విధులు

కార్యాలయ సిబ్బంది కుంగి పోయిన టైల్స్ మధ్యనే పనులను కొనసాగిస్తున్నారు. అప్పుడప్పుడు అంగన్‌వాడీ కార్యకర్తలకు అదే కార్యాలయంలో సమావేశాలను కూడా నిర్వహిస్తున్నారు. అస్తవ్యస్తంగా ఫ్లోరింగ్ ఉండటంతో మధ్యలో ఉన్న సందుల్లోంచి పురుగు, పుట్ర వస్తాయోమోనని సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. వాటికి మరమ్మతులు చేపట్టాల్సిన అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదనే విమర్శలు వినబడుతున్నాయి.

అధికారులకు విన్నవించాం

ఐసీడీఎస్ కార్యాలయ బిల్డింగ్‌లో కుంగిపోయిన ఫ్లోరింగ్ పనులను చేపట్టాలని అధికారులకు విన్నవించాం. చూస్తామన్నారు. మరొకసారి అధికారులకు విన్నవించి ఫ్లోరింగ్ పనులను చేపట్టే విధంగా చర్యలు తీసుకుంటాం.

– ఉమామహేశ్వరి, ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ

నెలాఖరులోగా పన్ను చెల్లిస్తే వడ్డీ రాయితీ


మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్

ఎమ్మిగనూరుటౌన్: ఆస్తి, ఖాళీ స్థలాల పన్ను ఈనెలాఖరులోగా చెల్లిస్తే బకాయిదారులకు పన్నుపై విధించిన వడ్డీలో 50 శాతం రాయితీ వర్తిస్తుందని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి తెలిపారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాయితీని సద్వినియోగం చేసుకొని ఏక మొత్తంలో తమ ఆస్తి పన్నులు చెల్లించాలని సూచించారు. అదేవిధంగా ఇప్పటికే పన్ను బకాయిలు వడ్డీతో కట్టిన వారందరికీ కూడా రాయితీ వర్తిస్తుందని, వారు కట్టిన వడ్డీలో 50శాతం వచ్చే ఆర్థిక సంవత్సరం పన్నులకు జమ చేయబడునని తెలిపారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

ఆదోని టౌన్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, తద్వారా ప్రజారోగ్యం భద్రంగా ఉంటుందని కమిషనర్ ఎం.కృష్ణ తెలిపారు. అన్నా క్యాంటీన్‌లలో భోజనం, టిఫిన్ ఆరగించాలని పేదలకు సూచించారు. పాత ఫ్లైఓవర్ బ్రిడ్జి సమీపంలో పారిశుధ్య పనులను పరిశీలించారు. ఎంజిజీ కాలనీ, పాత పార్కు రోడ్డు, గాంధీ పార్కు, నిర్మల్ టాకీస్ ఏరియాలో ఉన్న అన్నా క్యాంటీన్‌ను కమిషనర్ తనిఖీ చేశారు. అనంతరం బండిమెట్ట కాలనీలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభించారు.

ప్రభుత్వ ఇఫ్తార్ విందును తిరస్కరిస్తున్నాం

ఎమ్మిగనూరుటౌన్:వక్ఫ్ బిల్లు విషయంలో కూటమి ప్రభుత్వం ముస్లింల పక్షాన నిలబడకపోవడంతో ప్రభుత్వం ముస్లింలకు ఇచ్చే ఇఫ్తార్ విందును రాష్ట్రంలో ఎస్‌డీపీఐ బహిష్కరిస్తుందని ఆపార్టీ పట్టణ అధ్యక్షుడు హుసేన్‌బాషా తెలిపారు. మంగళవారం అయన విలేకరులతో మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తెచ్చిన వక్ఫ్‌బోర్డ్ సవరణ బిల్లును కూటమి ప్రభుత్వం వ్యతిరేకించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముస్లిం ఓట్ల కోసం ప్రజా ధనం రూ.1.5కోట్లతో ఇఫ్తార్ విందు పేరుతో ఖర్చు పెట్టడం తప్పితే ప్రయోజనం లేదన్నారు. ఎన్నికల ముందు టీడీపీ ముస్లింలకు అండగా వుంటుందని బూటకపు మాటలు చెప్పి లబ్ధిపొందిందన్నారు. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన వక్ఫ్‌బోర్డ్ బిల్లును వ్యతిరేకించాలని, లేనిచో రాబోయే ఎన్నికల్లో ముస్లిం సమాజం ఓటుతో బుద్ధి చెబుతుందని హెచ్చరించారు. వక్ఫ్‌బిల్లును వ్యతిరేకించని టీడీపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు పండుగ పూట ముస్లింలపై కపట ప్రేమను చూపేందుకు ఈద్గాలకు, మసీదులకు రాకూడదని తమ పార్టీ డిమాండ్ చేస్తుందన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు


క్షతగాత్రులకు అంబులెన్స్‌లో చికిత్స అందిస్తున్న ఈఎంటీ

కోసిగి: మండల పరిధిలోని కొల్మాన్‌పేట గ్రామ సమీపంలో బైక్‌పై వెళ్తున్న ఇద్దరు వ్యక్తులను ఎదురుగా వస్తున్న ఇసుక టిప్పర్ ఢీకొట్టడంతో తీవ్ర గాయాలైన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు కౌతాళం మండలం నదిచాగి గ్రామానికి చెందిన బోయ మహాదేవ అనే వ్యక్తికి త్వరలో ఎంగేజ్‌మెంట్ జరుగనుంది. దీంతో కొల్మాన్‌పేట గ్రామంలో ఉన్న తమ పెద్దమ్మ కుమారుడు బళ్లారి మహదేవ పిలుచుకుని బైక్ పై బంధువులను ఆహ్వానించేందుకు బయలుదేరారు. కొల్మాన్‌పేట గ్రామం నుంచి బయలు దేరి దుద్ది గ్రామం మీదుగా వెళ్తుండగా ఎదురు వస్తున్న ఇసుక టిప్పర్ (ఏపీ 07 టీఈ0225) ఢీకొట్టడంతో కింద పడిపోగా.. కాళ్లు విరిగి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు క్షతగాత్రులను కోసిగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకొచ్చి ప్రథమ చికిత్స అందించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం 108 వాహనంలో ఆదోని ఏరియా ఆసుపత్రికి తరలించారు.

జేఎల్‌బీ మార్కెట్ వేలాలు మళ్లీ వాయిదా


కమిషనర్‌తో చర్చిస్తున్న కాంట్రాక్టర్లు

ఆదోని టౌన్: ఆదోని మున్సిపాలిటీకి ఆదాయ వనరైన ఝాన్సీ లక్ష్మీబాయి(జేఎల్‌బీ) కూరగాయల మార్కెట్ వేలం పాట మళ్లీ వాయిదా పడింది. మంగళవారం కమిషనర్ ఎం.కృష్ణ ఆధ్వర్యంలో కౌన్సిల్ సమావేశ హాల్‌లో వేలంపాటలు నిర్వహించారు. అయితే అధికారులు పెట్టిన నిబంధనలు తమకు నష్టాలను చేకూరుస్తున్నాయని, కొన్ని నిబంధనలను సడలించినట్లయితే తాము వేలం పాటల్లో పాల్గొంటామని కాంట్రాక్టర్లు తిమ్మప్ప, కాశీ, తదితరులు కమిషనర్ ఎం.కృష్ణ దృష్టికి తీసుకొచ్చారు. నిబంధనలను సడలించే అధికారం తమకు లేదని మున్సిపల్ కమిషనర్ సమాధానంగా చెప్పారు. దీంతో కొంతమంది కాంట్రాక్టర్లు మార్కెట్‌యార్డులో ఉన్న ఝాన్సీ లక్ష్మీబాయి కూరగాయల మార్కెట్‌ను పట్టణంలోకి మార్చాలని, అనంతరం తాము వేలం పాటల్లో పాల్గొంటామని తేల్చి చెప్పారు. అందుకు కమిషనర్ కౌన్సిల్ దృష్టికి తీసుకొచ్చి, చర్యలు తీసుకుంటామని చెప్పగా కాంట్రాక్టర్లు బయటకు వెళ్లిపోయారు. దీంతో తాత్కాలికంగా వేలంపాటలను వాయిదా వేశామని, త్వరలోనే వేలం పాటలను నిర్వహిస్తామని మున్సిపల్ కమిషనర్ తెలిపారు.

పశ్చిమ ప్రాంత అభివృద్ధికి నిధులు కేటాయించాలి


మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య

ఆదోని రూరల్: జిల్లా పశ్చిమ ప్రాంత అభివృద్ధికి ప్రత్యేక ప్యాకేజీ కింద నిధులు కేటాయించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కర్నూలు జిల్లా ఆదోని పశ్చిమ ప్రాంతం కరువుకు, వలసలకు నిలయంగా మారిపోయిందన్నారు. ఈ ప్రాంతంతో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులు, వేదావతి, గుండ్రేవుల రిజర్వాయర్, ఆర్‌డీఎస్ కుడి కాలువ, గురు రాఘవేంద్ర ప్రాజెక్టులకు నిధులు కేటాయించకుండా ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయన్నారు. దీంతో ఈ ప్రాంతం ఎడారిగా మారే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, మంత్రులు, కూటమి ప్రభుత్వం స్పందించి జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేసి రైతులకు సాగు, ప్రజలకు తాగునీరు అందించాలన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అజయ్‌బాబు, సీపీఐ పట్టణ కార్యదర్శి సుదర్శన్, జిల్లా సమితి సభ్యులు టి.వీరేష్, పార్టీ, ప్రజాసంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కోలుకోలేక వ్యక్తి మృతి

దేవనకొండ: మండలంలోని కె.వెంకటాపురం గ్రామానికి చెందిన గోకారి(35) వ్యక్తిగత పనుల నిమిత్తం శనివారం కర్నూలుకు ద్విచక్రవాహనంపై బయలుదేరగా, నాగలాపురం వద్ద బైకు అదుపు తప్పి కిందపడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే స్థానికులు గోకారిని కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్సల నుంచి కోలుకోలేక మంగళవారం మృతిచెందాడు. మృతుడికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి


విద్యుదాఘాతానికి గురై చనిపోయిన ఎద్దు

పెద్దకడబూరు : విద్యుదాఘాతానికి గురై ఎద్దు మృతి చెందిన ఘటన మండల కేంద్రంలో మంగళవారం చోటుచేసుకుంది. బాధిత రైతు కురువ వెంకటేష్, స్థానికుల వివరాల మేరకు రైతు మొక్కజొన్న చొప్పను ఎద్దుల బండితో తరలిస్తున్నాడు. బండిపై నుంచి చొప్ప కిందకు పడకుండా అడ్డుగా బండికి ఇనుప కొయ్యలను అమర్చుకున్నాడు. పొలంలో కిందికి వేలాడుతున్న విద్యుత్ వైర్లు ఇనుప కొయ్యలకు తగలడంతో బండికి కట్టిఉన్న ఎద్దు విద్యుదాఘాతానికి గురై చనిపోయింది. రైతు బండి కింద పడిపోవడంతో ప్రాణాపాయం తప్పింది. దాదాపు రూ. 60వేలు విలువచేసే ఎద్దు చనిపోవడంతో తన చేయ్యి విరిగిన పని అయ్యిందని రైతు వాపోయాడు. ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకున్నాడు.

నేడు మున్సిపల్ సమావేశం

ఎమ్మిగనూరుటౌన్: స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో బుధవారం ఉదయం 11గంటలకు మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహిస్తున్నట్లు చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘు మంగళవారం తెలిపారు. సమావేశానికి కౌన్సిల్ సభ్యులు హాజరుకావాలని కోరారు.


28న పంచాయతీ వేలం పాటలు

గోనెగండ్ల : మండల కేంద్రం గోనెగండ్ల గ్రామ పంచాయతీ కార్యాలయంలో సంతమార్కెట్, బండిమెట్ట, కమేళాకు సంబంధించి 28వ తేదీన(శుక్రవారం) వేలం పాటలు ఉంటాయని పంచాయతీ ఈఓ సతీష్, సర్పంచ్ హైమావతి మంగళవారం తెలిపారు. వేలం పాటలు శుక్రవారం ఉదయం 10 గంటలకు ప్రారంభిస్తామన్నారు. ఆసక్తి ఉన్న వారు రూ.15వేలు డిపాజిట్ చెల్లించి వేలం పాటలో పాల్గొనవచ్చన్నారు. అలాగే వేలం పాడేవారు గ్రామ పంచాయతీకి ఎటువంటి బకాయిలు ఉండరాదని చెప్పారు.

29 మందికి ఉద్యోగాలు


ఆదోనిసెంట్రల్: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మంగళవారం నిర్వహించిన క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్, మెగా జాబ్‌మేళాలో 29 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఎస్.సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఇందులో ఈసీఈ బ్రాంచి నుంచి 13 మంది, ఈఈఈ బ్రాంచి నుంచి 16 మంది మొత్తం 29 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారన్నారు. జాబ్‌మేళాలో చెన్నై నుంచి రాయల్ ఎన్‌ఫీల్డ్ సంస్థ, కడప నుంచి యంగ్ ఇండియా, హైదరాబాద్ నుంచి జస్ట్ ఇన్ ఫౌండేషన్, టైక్ డైక్యాస్ట్ తదితర పరిశ్రమలు పాల్గొన్నాయన్నారు. కార్యక్రమంలో ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ అధికారి రామసుబ్బారెడ్డి, సిబ్బంది ఆదిశేషయ్య, పెద్దారెడ్డి, కిరణ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కడుపునొప్పి తాళలేక యువకుడి ఆత్మహత్య


ఉదయ్ (ఫైల్)

ఆదోని అర్బన్: పట్టణంలోని క్రాంతినగర్‌కు చెందిన నరసమ్మ, విజయ్‌కుమార్ దంపతుల కుమారుడు ఉదయ్(21) అనే యువకుడు కడుపునొప్పి తాళలేక సోమవారం రాత్రి ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తల్లి నరసమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు టూటౌన్ హెడ్‌కానిస్టేబుల్ పెద్దయ్య కేసు నమోదు చేశారు. ఉదయ్ కొద్ది రోజులుగా కడుపునొప్పితో బాధపడుతున్నారు. ఈ నేపథ్యంలో మనస్థాపానికి గురై సోమవారం రాత్రిపై అంతస్తులో పడుకోవడానికి వెళ్లి ఫ్యాన్‌కు ఉరేసుకుని మృతిచెందాడు. సాయంత్రం వెళ్లిన ఉదయ్ కిందకు రాలేదని పైకి వెళ్లి కుటుంబ సభ్యులు చూడగా ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు. మృతుడికి తల్లిదండ్రులు, తమ్ముడు ఉన్నారు. మృతుడు రెండేళ్ల క్రితం ఐటీఐ పూర్తి చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ పెద్దయ్య తెలిపారు.

వివాహిత అదృశ్యం


హేమావతి (ఫైల్)

ఆదోని రూరల్: మండలంలోని పెద్దహరివాణం గ్రామానికి చెందిన అయ్యమ్మ అలియాస్ హేమావతి ఈనెల 8వ తేదీన ఉదయం 11 గంటలకు ఇంటి నుంచి వెళ్లి కనపడకుండా పోయిందని భర్త కురువ గర్జప్ప మంగళవారం ఫిర్యాదు చేసినట్లు ఇస్వీ ఎస్ఐ నాగేంద్ర తెలిపారు. కోసిగి మండలం అగసనూరు గ్రామానికి చెందిన అయ్యమ్మ ను ఆదోని మండలం పెద్దహరివాణం గ్రామానికి చెందిన కురువ గర్జప్పతో ఆరేళ్ల క్రితం ఇచ్చి వివాహం చేశారు. వీరికి ఐదేళ్ల కుమార్తె ఉంది. అయితే అయ్యమ్మ ఇంటి నుంచి కనపడకుండా పోవడానికి కారణాలు తెలియడం లేదని, బంధువుల వద్ద విచారించినా ఎక్కడా ఆచూకీ లభించలేదన్నారు. దీంతో ఆమె భర్త పోలీసులను ఆశ్రయించాడన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వైఎస్సార్‌సీపీ పాలనలో వాల్మీకులకు పెద్దపీట


మాట్లాడుతున్న వాల్మీకి సంఘం నాయకులు కిశోర్

ఆదోని టౌన్: వైఎస్సార్‌సీపీ పాలనలో వాల్మీకులకు పెద్దపీట వేయడం జరిగిందని వాల్మీకి సంఘం నాయకులు కిశోర్, నాగరాజు, మల్లి, సుధాకర్, శ్రీనివాసులు, గుంతెప్ప తెలిపారు. మంగళవారం స్థానిక ద్వారకా ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఆదోని మాజీ ఎమ్మెల్యే వై.సాయిప్రసాద్‌రెడ్డి వాల్మీకుల అభ్యున్నతికి ఎంతో కృషి చేశారన్నారు. ఆదోని ఎంపీపీగా దానమ్మ, చైర్‌పర్సన్‌గా బోయశాంతను ఏకగ్రీవంగా ఎంపిక చేశారని గుర్తు చేశారు. గతంలో జెడ్పీ చైర్మన్‌గా తిక్కన్నను ఎంపిక చేసిన ఘనత సాయిప్రసాద్‌రెడ్డికే దక్కిందన్నారు. ఆదోని నియోజకవర్గంలో వాల్మీకులు అన్నివిధాలుగా అభివృద్ధి చేస్తూ వారి అభ్యున్నతికి పాటుపడిన ఏకైక నేత సాయిప్రసాద్‌రెడ్డి అని చెప్పారు. 155 ఏళ్ల చరిత్ర కలిగిన ఆదోని మున్సిపాలిటీకి చైర్‌పర్సన్‌గా వాల్మీకి వర్గానికి చెందిన బోయ శాంతను ఎంపిక చేయడం జరిగిందన్నారు. వాల్మీకులకు పెద్దపీట వేసిన సాయిప్రసాద్‌రెడ్డిపై విమర్శలు చేయడం తగదన్నారు. ఆదోని నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ హయాంలోనే అభివృద్ధి చెందిందన్నారు. కూటమి ప్రభుత్వం పది నెలల పాలనలో చేసిందేమీ లేదన్నారు.

రీ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి


రైతులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ మౌర్యభరద్వాజ్

నందవరం : రీ సర్వే అధికారులు, వీఆర్వోలు, సర్వేయర్లు రీ సర్వేలో భాగంగా ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ ఆదేశించారు. మంగళవారం మండల పరిధిలోని కొత్త కైరవాడి గ్రామంలోని సచివాలయంలో ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను సబ్ కలెక్టర్ పరిశీలించారు. అనంతరం రీ సర్వేపై రైతులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ..రీ సర్వేలో సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని రైతులకు సూచించారు. భూముల కొలతలు పూర్తి చేశామని, ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ చేయాల్సి ఉందని వివరించారు. భూ సమస్యలకు తావులేకుండా రైతులకు సంబంధించి భూ పత్రాలు, రికార్డులను పరిశీలించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు, ఆర్ఎస్‌డీటీ మహేష్, మండల సర్వేయర్ అక్బర్‌బాషా, వీఆర్వోలు, గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.

టీకాలపై ప్రత్యేక దృష్టి సారించాలి


మాట్లాడుతున్న యూ–విన్ పోగ్రామ్ అధికారి డాక్టర్ రోశన్

నందవరం : చిన్నారులు, గర్భిణులకు ఇచ్చే రోధనిరోధక టీకాలపై వైద్యాధికారులు, హెల్త్ అసిస్టెంట్లు ప్రత్యేక దృష్టి సారించాలని యూ–విన్ పోగ్రామ్ అధికారి డాక్టర్ రోశన్ సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాకర్లు శ్రీలేఖ, రేవతి ఆధ్వర్యంలో ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలకు 'యూ–విన్' కార్యక్రమంపై జిల్లా కో ఆర్డినేటర్ నేతృత్వంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ..గర్భిణుల నమోదు, చైల్డ్ రిజిస్ట్రేషన్, టీకాల వివరాలు యూ–విన్ యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు శ్రీనివాసులు, పీహెచ్ఎన్‌లు మరియమ్మ, సుశీల, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు పాల్గొన్నారు.

నాటుసారాతో రోగాలు


నాటుసారాపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

పెద్దకడబూరు : నాటుసారా తీసుకోవడం వల్ల అనారోగ్య సమస్యలతో ఆస్పత్రి పాలవుతారని ఎక్సైజ్ సీఐ భార్గవరెడ్డి అన్నారు. మండల పరిధిలోని కల్లుకుంట, మేకడోణ గ్రామాలలో నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా నాటుసారా రహిత సమాజ నిర్మాణం కోసం మంగళవారం ప్రజలకు అవగాహన కల్పించారు. ముందుగా గ్రామంలోని ప్రధాన కూడలిలో పోస్టర్లు అతికించి కరపత్రాలను పంచిపెట్టారు. ఆయన మాట్లాడుతూ నాటుసారా తాగడం వలన గుండె సంబంధిత, జీర్ణ కోశ వ్యాధులు, నరాల బలహీనత, కిడ్నీ తదితర సమస్యలతో ఆస్పత్రి పాలై ఆర్థికంగా ఇబ్బందులు పడతారని హెచ్చరించారు. నాటుసార రహిత సమాజ నిర్మాణం కోసం అందరూ ముందుకు నడుద్దామని పిలుపునిచ్చారు.

భూముల విషయంలో గొడవలు వద్దు

పెద్దకడబూరు : రైతులు తమ భూముల సరిహద్దుల విషయంలో ఎలాంటి గొడవలకు పోరాదని తహసీల్దారు గీత ప్రియదర్శిని సూచించారు. మండల పరిధిలోని నౌలేకల్లు గ్రామంలో రీసర్వే పూర్తి అయిన సందర్భంగా ఆమె మంగళవారం గ్రామాన్ని సందర్శించారు. ఆమె మాట్లాడుతూ రీ సర్వే పూర్తి అయింది కావున సర్వేయర్లు రీ సర్వేలో రైతులకు ఎవరికి ఎంత ఉందో(ఆన్‌లైన్‌లో) అదేవిధంగా సర్దుబాటు చేసి ఇస్తారని సూచించారు. రైతులు కోర్టు వ్యవహారాలు, నోటీసులు అంటూ సర్వేలకు అడ్డుపడవద్దని కోరారు. భూ సమస్యలు గ్రామంలోనే పరిష్కారం అయ్యేవిధంగా రైతులు చొరవతీసుకోవాలన్నారు.

జాతీయ స్థాయి ఖోఖో పోటీల్లో ప్రతిభ


కాంస్య పతకంతో పీఈటీ చెన్నబసప్ప

ఆదోని సెంట్రల్: ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ ఖోఖో పోటీల్లో పీఈటీ చెన్నబసప్ప కాంస్య పతకం సాధించారు. ఈ నెల 21వ తేదీ నుంచి 24వ తేదీ వరకు ఢిల్లీలో నిర్వహించిన జాతీయ స్థాయి సివిల్‌సర్వీసెస్ క్రీడలకు ఎంపికై ఖోఖో క్రీడలో ఆంధ్రప్రదేశ్ జట్టుకు ప్రాతినిత్యం వహించి జట్టు గెలుపునకు తోడ్పాటునందిచారు. ఈ సందర్భంగా కర్నూలు జిల్లా ఖోఖో అసోసియేషన్ కోశాధికారి ఖలీల్‌అహ్మద్ పీఈఈ చెన్నబసప్పను అభినందించారు.